10న జాతీయ లోక్ అదాలత్

బెలగాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించడానికి, వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి మే 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాదాల పరిహారాల కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడానికి లోక్ అదాలత్ వారధిగా ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు కేసులను రాజీ చేసుకుంటే సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయని తెలిపారు.

లక్ష్యం చేరుకునేనా?

- పార్వతీపురం మునిసిపాలిటీలో పన్నుల వసూళ్లు అంతంత మాత్రమే
- 50శాతం వడ్డీ రాయితీపై చెల్లింపునకు మరో 15 రోజులే గడువు
- 93 శాతానికి చేరుకుంటేనే 15వ ఆర్థిక సంఘం నిధులు
- తీవ్రంగా శ్రమిస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రేడ్ -1 మునిసిపాలిటీ అయిన పార్వతీపురంలో ఆస్తి పన్ను వసూలుకు సంబంధిత అధికారులు, సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. పన్ను వసూళ్ల 93 శాతానికి చేరుకోకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రపంచ బ్యాంకు విడుదల చేయదని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు హెచ్చరికలు జారీ చేయడంతో పార్వతీపురం మునిసిపల్ రెవెన్యూ అధికారులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. దీంతో పన్నుల వసూళ్లకు తీవ్రంగా శ్రమిస్తోన్నారు. 2024-25కి గాను గతనెల 31 నాటికి ఇంటి పన్ను వసూళ్ల గడువు ముగిసింది. పన్ను తక్కువగా వసూలు కావడంతో ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. 50 శాతం వడ్డీ రాయితీతో ఈ నెల 30 వరకు పన్నులు చెల్లించుకోవచ్చని చెప్పింది. ఈ అవకాశాన్ని ఎంతమంది వినియోగించుకుంటారో? లేదో త్వరలో తెలియనుంది.

ఇదీ పరిస్థితి..

గ్రేడ్-1 మునిసిపాల్టీ పార్వతీపురంలో 13,550 నివాస, ఇతర వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 122 భవనాలు ఉన్నాయి. వీటి నుంచి పన్నులు వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకునేందుకు మునిసిపల్ రెవెన్యూ అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. రెవెన్యూ అధికారి రూబేను పర్యవేక్షణలో ఆర్‌ఐలు ఈశ్వరరావు, వినయ్, మునిసిపల్ సిబ్బందితో పాటు సచివాలయాల అధికారులు పన్నులు వసూలు చేసేందుకు నిత్యం కష్టపడుతున్నప్పటికీ ఫలితం అంతత మాత్రంగానే కనిపిస్తోంది. 2024-25కి గాను ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల నుంచి రూ.991.81 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా, గత నెల 31 నాటికి కేవలం రూ.4.87 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.504.79 కోట్లు రావాల్సి ఉంది. నివాసాలు, ప్రైవేట్ భవనాలకు సంబంధించి రూ.5.49 కోట్లుకు గాను రూ.4.43 కోట్లు వసూలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించి సుమారు రూ.4.50 కోట్లు వరకు రావాల్సి ఉంది. జిల్లా ఏరియా ఆసుపత్రే రూ.3.15 కోట్లు పన్ను బకాయి పడింది. వడ్డీతో కలిపి రూ.5కోట్లు రావాల్సి ఉంది. దీంతో పాటు రూ.36లక్షల ఇంటి పన్నుకు సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల భవనాల నుంచి పన్నులు వసూళ్లు అయ్యే దాఖలాలు కనిపించడం లేదు. నీటి చార్జీలు రూ.3.25 కోట్లుకు రూ.66 లక్షలు మాత్రమే వసూలు జరిగింది.



పార్వతీపురం మునిసిపల్ కార్యాలయం

ఇంకా రూ.2.61 కోట్లు రావాల్సి ఉంది. 93 శాతం పన్నుల లక్ష్యాలను చేరుకోకపోతే 15వ ఆర్థిక సంఘ నిధులను ప్రపంచ బ్యాంకు విడుదల చేయదని, రాష్ట్ర పురపాలనశాఖ కార్యాలయ సంచాకులు ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో పన్నులను వసూలు చేసేందుకు పార్వతీపురం మునిసిపల్ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. 50 శాతం వడ్డీపై పన్నుల చెల్లించేందుకు ఇంకా 15 రోజులే గడువు ఉండడంతో లక్ష్యం నెరవేరుతుందో? లేదో చూడాలి.



పన్ను చెల్లించేందుకు క్యూలో ఉన్న భవన యజమానులు

కృషి చేస్తున్నాం

పన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకునేందుకు శ్రమిస్తున్నాం. 2025-26కి గాను రూ.10.74కోట్లు ప్రైవేట్, ప్రభుత్వ భవనాల నుంచి పన్ను వసూలు చేసేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణను రూపొందించాం. 15వ ఆర్థిక సంఘ నిధులు మునిసిపాల్టీకి మంజూరయ్యేలా కృషి చేస్తున్నాం.

-డి.రూబేను, మునిసిపల్ రెవెన్యూ అధికారి, పార్వతీపురం.

కనీస అక్షరజ్ఞానం ఉండాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ● నేటి నుంచి నిరక్షరాస్యుల సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వయోజన విద్యా కార్యక్రమం కింద శిక్షణ పొందే వారికి కనీస అక్షరజ్ఞానం ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమం కింద చదవడం, రాయడం, పుస్తకాల నిర్వహణ, ప్రయాణ సమయంలో అసౌకర్యానికి గురికాకుండా ఉండడం, ఫోన్‌లో వచ్చే సమాచారం అర్థం చేసుకోవడం వంటి కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. ఉల్లాస్ మొదటి దశలో గతంలో 23,944 మంది అక్షరాస్యులు అయ్యారన్నారు. ప్రస్తుత దశలో 25,579 మంది నిరక్షరాస్యులను ఇందులో చేర్పిస్తామన్నారు. మే 5నుంచి సెప్టెంబరు 8వరకు బోధనా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి వైకుంఠరావు మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 24 వరకు నిరక్షరాస్యుల సర్వే జరుగుతుందన్నారు. 29న మండల స్థాయిలో అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, వెలుగు ఏపీఎంలతో అవగాహనా సమావేశం నిర్వహిస్తామన్నారు. బోధనా తరగతులు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 వరకు ఉంటాయని తెలిపారు. ఐసీడీఎస్, మెప్మా, పంచాయతీ కార్యదర్శులు, విద్యాశాఖాధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, ఐసీడీఎస్ పీడీ పి.కనకదుర్గ, డీపీవో టి.కొండలరావు, డీపీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ తరగతులు

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మే 1వ తేదీ నుంచి 31 వరకు వివిధ క్రీడాంశాల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి సాధికార అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు అర్హులని అన్నారు. జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ ఆటల విభాగానికి సంబంధించి శిక్షకుడు, క్రీడాంశాలు, వేదికలకు సంబంధించి ప్రతిపాదనలు శాప్ ఆమోదానికి పంపించినట్లు తెలిపారు. క్రీడా శిక్షణకు సంబంధించి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా క్రీడల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతిపాదనలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బిల్లుమడ తోటల్లో ఏనుగుల తిష్ఠ

- అప్రమత్తమైన అటవీశాఖాధికారులు



బిల్లుమడలో సంచరిస్తున్న ఏనుగులు

భామిని, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బిల్లుమడ గ్రామ సమీప తోటల్లో ఏనుగులు తిష్ఠ వేశాయి. దీంతో అటవీశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం పాలకొండ ఫారెస్ట్ రేంజర్ కె.రామారావు కేర్ ట్రాకర్స్‌తో కలిసి బిల్లుమడ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వంశధార నదికి వెళ్లే రహదారి లోని బిల్లుమడ తోటల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని, ప్రజలు అటువైపు వెళ్లవద్దని సూచించారు. ఏనుగులు తమకు నచ్చినట్టు వ్యవహరిస్తాయన్నారు. వాటి నడవడికలను గమనించి ప్రజలు, రైతులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఏనుగులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అటవీశాఖ సబ్ డివిజనల్ అధికారి సంజీవెళ్ల అధికారులకు సూచించారు. సోమవారం రాత్రి సింగిడి వద్ద జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఏనుగులు ఉన్నాయని, వాటి వద్దకు వెళితే దాడికి పాల్పడతాయని అన్నారు. ఏనుగులకు ఫొటోలు తీయవద్దని, మనుషులను చూస్తే చిరాకు పడతాయని పేర్కొన్నారు. పూజారి శంకర్ ఏనుగుల దాడి నుంచి బయటపడడం అదృష్టమన్నారు. బిల్లుమడ, నేరడి, సింగిడి, పసుకుడి, లివిరి తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి ఆమోదం

- కొత్తవలసలోనే ఏర్పాటు ● క్యాబినెట్‌లో తీర్మానం

కొత్తవలస, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రెల్లి రెవెన్యూ పరిధిలో అప్పన్నదొరపాలెం గ్రామంలో రాష్ట్రహోంశాఖ ఆధ్వర్యంలో గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందుకు క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. దీంతో కొద్దిరోజుల్లో పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే రెండుదఫాలుగా విజయనగరం ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. రెండోసారి సభకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరై గ్రామస్థులతో మాట్లాడి ఒప్పించడంతో గ్రామ సభ ఆమోదం కూడా కొలిక్కివచ్చింది. 2014 సంవత్సరంలో రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం విభజన చట్టాన్ని అనుసరించి కేంద్ర విద్యాసంస్థ గిరిజన యూనిర్సిటీని ఏర్పాటు చేయదలిచింది. రెల్లి రెవెన్యూలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో సర్వేనెబర్లు 367-1, 368 నుంచి 376 వరకు, 379, 80, 81-1,2,3, 82-1,31-2ఏలలో 532 ఎకరాలను సేకరించింది. రోడ్డు, రైలు, విమాన మార్గాలను కూడా పరిగణనలోకి తీసుకుని అన్ని విధాల అనుకూలంగా ఉందని నివేదిక ఇవ్వడంతో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ తర్వాత ప్రహరీ నిర్మాణానికి అప్పట్లో కేంద్రం బడ్జెట్‌లో రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రహరీ కూడా పూర్తయింది. భవన నిర్మాణ పనులు మొదలయ్యేలోగా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. గిరిజన యూనిర్సిటీని ఇక్కడ కాకుండా మెంటాడ మండలంలో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇక్కడ రెవెన్యూ శాఖ సేకరించిన భూములను వైసీపీ ప్రభుత్వం ఎకరా రూ.27 లక్షల ధరకు ఏపీఐఐసీకి దారాదత్తం చేసింది. మెంటాడ సమీపంలో గిరిజన యూనిర్సిటీకి భూములను సేకరించడంతో పాటు భవన నిర్మాణ పనులను కూడా మొదలుపెట్టింది. ఈ పరిస్థితిలో అప్పన్నదొరపాలెం



గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం కోసం సేకరించిన స్థలం

భూములను మరో సంస్థకు అప్పగించడం ద్వారా ఉపయోగం ఉంటుందని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే విషయమై కొద్ది నెలలుగా సర్వే చేసింది. అన్ని విధాల అనుకూలంగా ఉంటుందని నివేదికలు రావడంతో గత ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించడం కోసం జారీ చేసిన జీవోను రద్దు చేస్తూ గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. తాజాగా క్యాబినెట్ సమావేశంలో మంత్రి వర్గం కూడా ఆమోదం తెలిపింది. దీంతో కొత్తవలసలో రాష్ట్ర హోంశాఖ ఆధ్వర్యంలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం త్వరలోనే ఏర్పాటు కానుంది.

● గతంలో ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి తమకు న్యాయం చేయాలని అప్పన్నదొరపాలెం, జోడుమెరక, తమ్మన్న మెరక గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా రత్నరాజు



రత్నరాజు

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కమిషనర్‌గా ఎస్‌జీవీ రత్నరాజును నియమిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్, డైరెక్టర్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రేడ్-2 కమిషనర్ అయిన రత్నరాజు ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉండగా ఆయనను పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇటీవల నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు ఏసీబీకి చిక్కడంతో ఆయన స్థానంలో నగర పంచాయతీ మేనేజర్ టి.జయరాం ఎఫ్ఏసీ కమిషనర్‌గా వ్యవహరించారు. తాజాగా రెగ్యులర్ కమిషనర్‌గా రత్నరాజును నియమించింది. ఆయన విధుల్లో చేరాల్సి ఉంది.

సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా కృష్ణారావు

సాలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా డీవీటీ కృష్ణారావు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన ప్రస్తుతం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయ గ్రీవెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు. అలాగే ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మేనేజర్‌గా కూడా పనిచేశారు. ఇక్కడ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సీహెచ్.సత్యనారాయణను విధుల్లో అలసత్వం వహించినందుకు గాను ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఆయన్ను మరలా సీడీఎంఏకు బదిలీ చేశారు.

మన కళాకారులకు 'కందుకూరి' పురస్కారాలు 6లో..

12న పైడిమాంబ దేవర ఉత్సవం 6లో..

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా రోడ్లు ● గోతులు, రాళ్లతో దర్శనం
- కానరాని బెర్మ్‌లు ● ప్రజలకు తప్పని ఇబ్బందులు



సాలూరు పట్టణంలోని బంగారమ్మకాలనీ వద్ద పూర్తిగా పాడైన బీటీ రోడ్డు

సాలూరు/వీరఘట్టం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గోతులు ఏర్పడి, రాళ్లు తేలి దారుణంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రహదారుల నిర్వహణను గాలికొదిలేసింది. దీనివల్ల అవి తీవ్రంగా దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా రోడ్లు బాగుపడుతున్నా యి. అయితే, ఇంకా చాలాచోట్ల గుంతల మయంగానే ఉన్నాయి. కొన్నిచోట్ల రోడ్లు నిర్మించి బెర్మ్‌లను ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనచో దకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురికాక తప్పదు. ● సాలూరు పట్టణంలోని బంగారమ్మకాలనీ సమీపంలో ఉన్న రోడ్డు పాడైపోవడంతో నిత్యం ద్విచక్ర వాహనదారులతో పాటు అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నా రు. ఆర్సీఎం పాఠశాల సమీపంలోని రోడ్డుపై మలుపు వద్ద గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కోట వీధి జంక్షన్‌తో పాటు చిట్లు వీధి తదితర వీధుల్లో రోడ్లు గుంతలతో నిండిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి వాటిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ● వీరఘట్టం మండలంలోని కంబర, గడగమ్మ, ఎం.రాజపురం గ్రామాలకు ఇటీవల బీటీ రహదారులు నిర్మించారు. రోడ్లకు ఇరువైపులా మట్టితో బెర్మ్‌లు ఏర్పాటు చేసి ఒక మీటరు వెడల్పుతో గ్రావెల్ వేయాలి. కానీ, ఈ రోడ్లపై బెర్మ్‌లు లేకపోవడంతో ట్రాక్టర్లు, లారీలు కిందకు దిగే సమయంలో రహదారి అంచులు దెబ్బతింటున్నాయి. కొన్నిసార్లు ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించాలి ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఏఈఈ సింధూజ మాట్లాడుతూ.. పరిశీలించి రోడ్లకు ఇరువైపులా బెర్మ్‌లు సక్రమంగా వేసేలా చూస్తామని తెలిపారు.



సాలూరు ఆర్సీఎం పాఠశాల వద్ద రోడ్డు మలుపులో ఉన్న గోతులు



వీరఘట్టం: బెర్మ్‌లు లేకపోవడంతో దెబ్బతింటున్న కంబర బీటీ రహదారి అంచులు

12న పైడిమాంబ దేవర ఉత్సవం

● 13న అమ్మవారు చదురుగుడికి రాక


అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ దేవర ఉత్సవాన్ని మే నెల 12న నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ కేఎస్‌డీ ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఈఓ కార్యాలయంలో పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ తలయారి రామవరపు చిన పైడిరాజు, ఏవో ఏడుకొండలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏటా వైశాఖ మాసంలో దేవర ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో మే 12న దేవర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా హుకుంపేటలోని పూజారి ఇంటికి తీసుకువెళ్లి, అక్కడ ఘటాభిషేకం చేస్తారు. అనంతరం నేలవేషాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తారని తెలిపారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు మాట్లాడుతూ పైడిమాంబను రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడికి తీసుకురావడమే దేవర ఉత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఉత్సవం అక్టోబరు నెలలో జరిగే సిరిమానోత్సవానికి నాంది వంటిదని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

13న చదురుగుడికి..

దేవర ఉత్సవంలో భాగంగా మే 13వ తేదీ ఉదయం 6.30 గంటలకు పైడిమాంబ చదురు గుడిలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ రోజు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆ రోజు నుంచి నగరంలో ఉన్న పైడిమాంబ భక్తులు ముర్రాటలు, పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. మొక్కుబడులు చెల్లించుకుంటారు.

ప్రత్యేక పూజలు

పైడిమాంబ చదురుగుడి, వనంగుడుల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఆలయ ఆవరణలో హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పైడిమాంబ వనంగుడి, చదురుగుడిల్లో వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పిండివంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో, అర్చకులు తదితరులు


వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామ పట్టాభిషేకం చేస్తున్న దృశ్యం

పాలకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముదునూరు వారి వీధిలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గత వారం రోజులుగా కొనసాగిన శ్రీరామ కళ్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం స్వామివారికి పుష్పా భిషేకం చేశారు. అనంతరం శ్రీరామునికి పట్టాభిషేకం చేశారు. అర్చకులు సూరిబాబు పట్టాభిషేక మహోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. పట్టాభిషేకానంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు పెదలి వెంకటరమణాచార్యులు, సీతారాం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


దాసరి తిరుపతినాయుడు


డి.మురళీధర్, సంగీత దర్శకుడు


పైడిరాజు, రంగస్థల నటుడు


మీగడ మల్లికార్జున స్వామి

మన కళాకారులకు 'కందుకూరి' పురస్కారాలు

● నేడు విజయవాడలో ప్రదానం


విజయనగరం రూరల్/రాజాం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగాఈ పురస్కారాలకు మన జిల్లా కళాకారులను ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను ఈ నెల 16న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం చేయనున్నారు. విజయనగరం జిల్లా నుంచి ఎనిమిది మంది ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో మీగడ మల్లికార్జున స్వామి (రాజాం), కేఎస్ఎన్ ఆచార్యబాబు (చీపురుపల్లి), జి.పైడిరాజు, దాసరి తిరుపతినాయుడు, వేమలి త్రినాథరావు, బత్తుల లక్ష్మి, కేవీ పద్మావతి, డి.మురళీధర్‌లు ఉన్నారు. వీరికి పురస్కారం కింద రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందించనున్నారు. 2018లో చివరిసారిగా కందుకూరి వీరేశలింగం పేరిట పురస్కారాలు ఇచ్చారు. ఏడేళ్ల విరామం తరువాత మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలు ప్రదానం చేయనుంది. కందుకూరి పురస్కారానికి ఎంపికైన కళాకారులను జిల్లాకు చెందిన కళాకారులు, కళాభిమానులు అభినందించారు.


కేవీ పద్మావతి

పార్వతీపురం మన్యంలో ముగ్గురికి..

జియ్యమ్మవలస, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పురస్కారానికి జిల్లాకు చెందిన రౌతు వాసుదేవరావు మాస్టారు (పెదమేరంగి) ఎంపికయ్యారు. ఆయనతో పాటు కె.మంగాదేవి (బాలగుడవ), ముప్పల వెంకటరమణ (పిరిడి) ఉన్నారు. అవార్డుకు ఎంపికైన వాసుదేవరావును జిల్లాలోని కళాకారులు, కళాభిమానులు అభినందించారు.


రౌతు వాసుదేవరావు


ఎం.వెంకటరమణ

పిండమార్పిడితో మంచి ఫలితాలు

● పశు సంపద అభివృద్ధికి చర్యలు
● పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు

రామభద్రపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పశువుల్లో పిండమార్పిడి విధానం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. జగన్నాథపురం గ్రామంలో మంగళవారం పిండ బదిలీ పద్ధతి ద్వారా ఉత్తరాంధ్రలో మొదటిసారిగా జన్మించిన గిరి జాతి ఆవు దూడను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత సంవత్సరంలో పిండ బదిలీ ప్రక్రియకు సంబంధించి 40 మందికి శిక్షణ ఇప్పించామని తెలిపారు. మేలుజాతి ఆడదూడలను ఈ పద్ధతి ద్వారా పొందవచ్చునన్నారు. ఈ ఏడాది 1500 పశువులకు పిండమార్పిడి విధానం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని ఈ ప్రక్రియను చేపడతామని తెలిపారు. దీని కోసం పశువైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని ఆయన వివరించారు. అనంతరం పాడి రైతులతో మాట్లాడి.. సమస్యలను తెలుసుకున్నారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ, డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ, ఉప సంచాలకులు డాక్టర్ దామోదరరావు, సహాయ సంచాలకులు విష్ణు, పశువైద్యాధికారు డాక్టర్ సురేష్, శ్రీనివాస్, జగదీష్‌లు పాల్గొన్నారు.


దూడను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు


సందడి చేసిన పులివేషధారులు

ఘనంగా ముత్యాలమ్మ పండుగ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గాజులరేగ ప్రజల ఇలవేల్పు, సిరులతల్లి ముత్యాలమ్మ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరం తో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గాజులరేగ కళకళలాడింది. ఉదయమే భక్తులు అధిక సంఖ్యలో ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ముత్యాలమ్మ పండుగ సందర్భంగా పులివేషాలు, నేలవేషాలు సందడి చేశాయి. అమ్మవారికి వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పండ్లు, పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు సోమవారం తోలేళ్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


ముత్యాలమ్మ

'సంపద' సంగతేంటి?

● చెత్త నిర్వహణకు అడ్డంకులు
● సహకరించని వైసీపీ సర్పంచులు
● నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం


గురవాం గ్రామంలో చెత్తను సేకరిస్తున్న దృశ్యం

రాజాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చెత్త సంపద కేంద్రాల వినియోగానికి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ దానికి స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దగా సహకరించడం లేదు. సర్పంచులలో ఎక్కువ మంది వైసీపీకి చెందిన వారు కావడంతో జిల్లాలో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, చెత్త సేకరణ వంటి విషయాల్లో వారి నుంచి సహకారం అందడం లేదని తెలుస్తోంది. దీంతో ఈ కార్యక్రమం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. పైగా అప్పుడెప్పుడో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన చెత్త ట్రాలీలు, మూడు చక్రాల రిక్షాలు పూర్తిగా పాడ య్యాయి. వైసీపీ సర్పంచులు కొత్తవి కొనుగోలు చేసేం దుకు ఇష్టపడడం లేదు. ఫలితంగా చాలా గ్రామాల్లో చెత్త సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మంచి ఉద్దేశంతో..

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. జిల్లాలో 777 గ్రామ పంచాయతీలకుగాను.. 608 చోట్ల వీటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రతి 1000 మంది జనాభాకు ఒకరు చొప్పున గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. వీరు ఇంటింటా విడిగా చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేవారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకునేవారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. జగనన్న స్వచ్ఛ సంకల్పంగా పేరు మార్చింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పేరుతో ఇష్టారాజ్యంగా వాహనాలను, రిక్షాలను కొనుగోలు చేసి పంచాయతీలకు అంటగట్టింది. అవసరం లేకున్నా వాటిని పంచాయతీలకు కేటాయించింది. కానీ సరిగా వినియోగించకపోవడంతో అవి మూలకు చేరాయి.

అన్ని ఏర్పాట్లు చేసినా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ షెడ్ల నిర్మాణానికి రూ.7 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఖర్చు చేశారు. పంచాయతీలో జనాభాను అనుసరించి వీటి నిర్మాణం చేపట్టారు. వానపాములు, ఎరువుల తయారీకి ఏర్పాట్లు చేశారు. చెత్త సేకరణకు జనాభా ప్రాతిప దికన క్లాప్ మిత్రలను కేటాయించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకుగాను ప్రతి ఇంటికీ బుట్టలను అందించారు. వీధుల్లో చెత్తను తీసుకురావడానికి మూడు చక్రాల రిక్షాలను సమకూర్చారు. కేంద్రాలకు తరలించేందుకు జనాభా ఎక్కువ ఉన్నచోట ఆటోలను ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు వీలుగా కేంద్రాల్లో నాడెప్‌లను నిర్మించారు. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవన్నీ మూలకు చేరాయి. లక్ష్యం పూర్తిగా దెబ్బతింది.

ఆదేశాలు ఇచ్చాం..

జిల్లాలో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తున్నాం. 777 పంచాయతీలకు గాను దాదాపు అన్ని చోట్లా వీటి నిర్మాణం పూర్తయ్యింది. చాలా కేంద్రాల్లో ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతోంది. మిగతా చోట్ల కూడా ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం.

- శ్రీధర్ రాజా, డీపీవో, విజయనగరం

షెడ్యూల్ ఇదే..

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది అక్టోబరు 2 నుంచి సంపద కేంద్రాలను పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇళ్లు, వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో చెత్త సేకరించాలన్నది ప్రణాళికలో భాగం. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలో రీసైక్లింగ్ చేయడానికి నిర్ణయించారు. మరోవైపు తడి చెత్తను ఎరువుల తయారీకి వినియోగించాలని ప్రణాళిక రూపొందించారు. అందుకే జిల్లా వ్యాప్తంగా సంపద కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తేవాలని ప్రణాళిక రూపొందించారు. కానీ చాలా పంచాయతీల్లో వైసీపీకి చెందిన సర్పంచ్‌లు మోకాలడ్డుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గాలతో పనిలేకుండా వీటిని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో ఉపశమనం

● ఈదురుగాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న

విజయనగరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురవగా.. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, దత్తిరాజేరు, చీపురుపల్లి, మెంటాడ, గుర్ల, రామభద్రపురం, మెరకముడిదాం, నెల్లిమర్ల, గంట్యాడ తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ చెబుతోంది. మంగళవారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న రైతులకు నష్టం వాటిల్లింది. జిల్లాలో సుమారు 150 ఎకరాలకు పైగా మొక్కజొన్నను సాగుచేస్తున్నారు. వర్షంతో వివిధ ప్రాంతాల్లో మొక్కజొన్న నేలకొరిగింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రబీలో నువ్వులు 250 హెక్టార్లు, రాగులు 100 హెక్టార్ల వరకు సాగుచేస్తున్నారు. ఈ పంటలతో పాటు, పూలు, మెట్టపంటలకు ఈ వర్షం ఉపయోగ కరంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

కురుపాంలో వర్షం

కురుపాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కురుపాంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల కారణంగా కొన్నిచోట్ల వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

వీరఘట్టంలో..

వీరఘట్టం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మంగళాపురంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో కొంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షం రైతులకు మేలు చేకూరుస్తుంది. నువ్వు పంటకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీతంపేటలో..

సీతంపేట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. కొద్ది రోజులుగా ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న మన్యం వాసులకు ఈ చిరుజల్లులు కొంత ఊరట కలిగించాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడి వర్షం కురిసింది.

రాజాంలో..

రాజాం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజాం, బొబ్బిలి ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులకు రాజాం- రామభద్రపురం ప్రధాన మార్గంలోని కొత్తపేట జంక్షన్‌లో రహదారిపై భారీ చెట్టు నేలకూలింది. ఆ సమయంలో రోడ్డు పై వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుపై అడ్డంగా చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సాయంత్రం భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు పెద్ద సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గత కొద్ది రోజులుగా అధికంగా ఎండలు ఉండడంతో ప్రజల అవస్థలు ఎదుర్కొన్నారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఎండల తీవ్రతతో అల్లాడిన జనం వర్షంతో కొంత సేదదీరారు.


మెంటాడ మండలం పెదమేడపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న


వీరఘట్టంలో కురుస్తున్న వర్షం


రాజాం రూరల్: కొత్తపేట జంక్షన్‌లో నేలకూలిన చెట్టు


గరుగుబిల్లి: పొలాల్లో చేరిన వర్షపు నీరు


గరుగుబిల్లి: తులసిరామినాయుడువలస రహదారిపై విరిగిన చెట్టు కొమ్మ

భూములు ఎగువన.. కాలువ దిగువన

● ఏడు గ్రామాల రైతులకు సాగునీటి కష్టాలు ● లిఫ్ట్ ఇరిగేషన్‌తో మేలు ● ఎమ్మెల్యేపైనే ఆశలన్నీ

రాజాం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు రాజాంలో కోండ్రు మురళీమోహన్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మండలంలోని మూడు పంచాయతీల పరిధిలోని ఏడు గ్రామాల ప్రజల్లో ఆశలు ప్రారంభమయ్యాయి. దశాబ్దానికి పైగా సాగునీటి కష్టాలకు శుభం కార్డు పడుతుందన్న నమ్మకం రైతాంగంలో కలుగుతోంది. నేలబావులు, చెరువులపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ నష్టాలను చవిచూస్తున్న అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆయా గ్రామాల మధ్య నుంచే తోటపల్లి కాలువలో జలసిరులు గలగలలాడుతూ వందలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతున్నా.. ఆ ఏడు గ్రామాల పరిధిలో ఒక్క ఎకరం భూమి కూడా తడవని దుస్థితి నెలకొంది. తోటపల్లి కాల్వ నిర్మాణంలో ఆయా గ్రామాల రైతులు భూములు త్యాగం చేసినా సాగునీరందని దైన్యం వారిది. కాల్వ తవ్వకం సమయంలో ఇంజనీరింగ్ అధికారులు ముందుచూపు లేకుండా వ్యవహరించడమే ఇందుకు కారణం.

ఊరు పక్కనే నీరు ఉన్నా.. వర్షాధారమే..

మండలంలోని బొమ్మినాయుడువలస, ఎం.జె.వలస, గారాజు చీపురుపల్లి పంచాయతీలతో పాటు వాటి పరిధిలోని బూరాడపేట, గెడ్డవలస, గొల్లలపేట, విజయరాంపురం గ్రామాల మీదుగా రెండు దశాబ్దాల క్రితం తోటపల్లి కాలువ నిర్మించారు. అయితే గ్రామాల పరిధిలో ఉన్న భూములు ఎత్తులో ఉండటం, కాల్వ దిగువన తవ్వకం చేపట్టడంతో పొలాలకు సాగునీటి సౌకర్యం కల్పించలేని పరిస్థితికి దారి తీసింది. ఫలితంగా వరుణుడు కరుణిస్తేనే సాగు చేయాల్సిన దుస్థితిలో వందలాది మంది రైతులున్నారు. ఏడు గ్రామాలలో సుమారు మూడువేల ఎకరాల సాగు వర్షాధారమే అయింది.

లిఫ్ట్ కోసం ఎన్నో వినతులు..

ఊరు పక్క నుంచే నీరు ప్రవహిస్తున్నా సాగునీటికి నోచుకోని పరిస్థితిపై ఏడు గ్రామాల రైతులు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని పార్టీలకు అతీతంగా ఆయా గ్రామాల ప్రతినిధులు అధికారులు, నాయకులకు అందజేసిన వినతులు బుట్ట దాఖలయ్యాయి. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఇతర నాయకులకు సమస్యను వివరించారు. అయినా ఫలితం శూన్యం. గత్యంతరం లేని పరిస్థితుల్లో నేల బావులు, చెరువుల్లోని నీటిని ఆయిల్ ఇంజిన్లతో తోడుతూ సాగు చేస్తున్నారు.


గెడ్డవలస సమీపంలో తోటపల్లి కాలువలో నీటి గలగలలు

వనజీవి రామయ్యపై సందేశం వారసత్వానికి గౌరవం

● ప్రధాని మోదీకి ఎంపీ కలిశెట్టి లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వనజీవి రామయ్య పట్ల తెలుగులో మీరు ఇచ్చిన సందేశం ఆయన వారసత్వాన్ని గౌరవించడమే కాకుండా, ప్రాంతీయ భాషలు, సంస్కృతులతో మీకున్న భావోద్వేగ సంబంధాన్ని కూడా ప్రదర్శించిందని ప్రధాని మోదీకి రాసిన లేఖలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. వనజీవి రామయ్య మృతి పట్ల హృదయ పూర్వక నివాళి తెలుపుతూ మోదీ తెలుగులో చేసిన ట్వీట్‌కు ఎంపీ ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం లేఖ రాశారు. వనజీవి రామయ్య అవిశ్రాంత ప్రయత్నాలను గుర్తించి మీరు ఇచ్చిన దయగల మాటలు పర్యావరణం కోసం నిస్వార్థంగా పనిచేసే వ్యక్తుల పట్ల మీకు ఉన్న లోతైన గౌరవాన్ని నిజంగా ప్రతిబింబిస్తాయని, ప్రకృతి పట్ల ప్రగాఢమైన ప్రేమ, భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయని మోదీకి రాసిన లేఖలో ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు.

సివిల్ సప్లైస్ డీఎంగా శాంతి

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లైస్ సంస్థ జిల్లా మేనేజర్‌గా బి.శాంతిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శాంతిని డీఎంగా నియమించింది. అలాగే తోటపల్లి భూసేకరణ యూనిట్-2 (చీపురుపల్లి) ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా టి.శివరామను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు అభ్యంతరాల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ప్రచురించడం జరిగిందని, దానిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 17న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో కోరారు. అభ్యంతరం చేసిన ఉపాధ్యాయుడి పూర్తి పేరు, హోదా వివరాలను తెలియజేయాలన్నారు. జాబితాలో ఎక్కడ తప్పిదం ఉంటే ఆధారాలతో సమర్పించాలన్నారు.

పిల్లలకు వేసవి శిక్షణ శిబిరం

రాజాం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిల్లల కోసం వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు జవహర్ బాలభవన్ పర్యవేక్షకుడు డాక్టర్ సుంకరి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నృత్యం, చిత్రలేఖనం, తబలా, టైలరింగ్ తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని మెంతిపేటలోని బాలభవన్‌లో ఈ నెల 24 నుంచి మే 31 వరకు ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మూడేళ్ల నుంచి 18 ఏళ్లలోపు వారు వినియోగించుకోవచ్చన్నారు. వివరాలకు 9912949492, 8639220158, 9553123447 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపల్లిలో గల రాజరాజేశ్వరిదేవి ఆలయం వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ, విజయలక్ష్మితో పాటు అర్చకుడు దూసి శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సత్కారం

జామి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ వీర జనార్దన్‌ను గోసంరక్షణ జిల్లా సమాఖ్య ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని లోట్లపల్లి పశువుల సంత కొనసాగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. అలాంటి సమయంలో ఎస్‌ఐ వీరజనార్దన్ పశువుల అక్రమ తరలింపుపై కొరడా ఝుళిపించారన్నారు. వారిపై కేసులు కట్టి వందలాది పశువులను రక్షించారని కొనియాడారు. అలాగే అదే పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు జంతు సరంక్షణకు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు సత్యనారాయణ, రెడ్డిపల్లి రవి, శంకర్, నీలాపు దేవి, యుమున, జీవన ఉన్నారు.


ఎస్‌ఐను సత్కరిస్తున్న ప్రతినిధులు

హోంగార్డుల సంక్షేమానికి కృషి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశ మందిరంలో హోంగార్డ్సు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు హోంగార్డ్సు కోసం సొసైటీ ఏర్పాటైందన్నారు. తక్కువ వడ్డీతో సొసైటీ ద్వారా రుణాలను మంజూరు చేస్తోందన్నారు. వ్యక్తిగత రుణాలను రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, పిల్లల వివాహాలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పెంచుతామన్నారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఆర్‌ఐ గోపాలనాయడు తదితరులు పాల్గొన్నారు.

సారాపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో నవోదయం 2.0లో భాగంగా సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు ఆదేశించారు. మంగళవారం నగరంలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎక్సైజ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా ముద్దాయిలు, అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, ఏఈఎస్‌లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సేవే పరమార్థంగా సాగండి


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శృంగవరపుకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవే పరమార్థంగా ముందుకు సాగాలనీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని నానిగిరి వీధిలో బీశెట్టి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు బీశెట్టి అరుణ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. వాహనదారులు, బాటసారులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా అరుణ, నాయుడు దంపతులను ఆమె అభినందించారు. కార్యక్ర మంలో జీఎస్ నాయుడు, చెల్లయ్య, కిరణ్, వాసు, బర్మాకాలనీ సాయి, పెదగాడ రాజు తదితరులున్నారు.

●ఎస్.కోట దారగంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్‌డీ లక్ష్మి ప్రారంభించారు. ఈవోపీఆర్‌డీ లక్ష్మి తన భర్త జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రాజ గోపాలచార్యులు, పోలమరశెట్టి రామకృష్ణ, మజ్జి శేఖర్ తదితరులున్నారు.

ఐటీఐతో మెరుగైన ఉపాధి అవకాశాలు



మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టి.వి.గిరి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, అప్రంటీస్ అడ్వైజర్ టి.వి.గిరి అన్నారు. మంగళవారం వి.టి.అగ్రహారంలోని ప్రభుత్వం ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి అప్రంటీస్ మేళాను నిర్వహించారు. మేళాకు ఐటీఐ పాసైన 91 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ కోర్సులకు నేడు ప్రాధాన్యత ఉందన్నారు. ఐటీఐ పూర్తయిన వెంటనే అప్రంటీస్‌షిప్‌లో చేసి అనంతరం ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మైలాన్ ఫార్మా డీజీఎం హరికృష్ణతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులు హేమకిరణ్, నాగరాజు, నందు, రామకృష్ణ, కె.గిరీశం, చంద్రశేఖర్, జి.కమల్, అలేఖ్య, రామాచారి పాల్గొన్నారు.

పైపులు విరగ్గొట్టిన ఆకతాయిలు

జామి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లువీధి అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన పైపులను సోమవారం రాత్రి ఆకతాయిలు విరగ్గొట్టారు. దాంతో సదరు అంగన్‌వాడీ కార్యకర్త మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వాటిని పరిశీలించారు. చీకటిపడిందంటే ఆకతాయిలు ఈ ప్రాంతంలో రెచ్చిపోతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

పనితీరు మార్చుకోండి: డీఎంహెచ్‌వో


రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

దత్తిరాజేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పరిధిలోని గర్భిణులు, ఓపీ, సాధారణ ప్రసవాల కోసం ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాక్సిన్‌లు నిల్వచేసే ఫ్రిజ్ సక్రమంగా నిర్వహించడం లేదని సంబంధిత అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. అందుకు గానూ గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. రక్త పరీక్షల ఫార్మేషన్ విధానంపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీశ్ ఉన్నారు.

●మెరకముడిదాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టీ, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే పీఎంజేఏపై, ఏబీహెచ్‌ఏ తదితర సర్వేలపై ఆరా తీశారు. ప్రతీనెలా పీహెచ్‌సీలో 5 నుంచి 10 డెలివరీలు చేయించాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు, వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అజిత్‌బాబు, సీహెచ్‌వో రామారావు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న వేణుగోపాలరాజు

డెంకాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కివరంలో పైడితల్లి అమ్మ వారి సిరిమానోత్సవానికి విశాఖకు చెందిన డి.వేణుగోపాలరాజు, సీతాలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఇక్కడి అమ్మవారికి సిరిమానోత్సవం నిర్వహించి దాదాపు వందేళ్లు కావస్తోందన్నారు. ఈసారి అమ్మవారికి సిరిమానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కంది సత్యనారాయణ, బొబ్బడి జయరాం, నాయుడుపల్లి గణేశ్, ఆల్తి ఉమామహేశ్వరరావు, కంది ఆదినారాయణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం వద్ద మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన ఇప్పిలి సత్యనారాయణ విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని చక్కెర కర్మాగారంలో విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పాలకొండ నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు గోపాలపురం వద్ద ఢీకొంది. ఈ ఘటనలో సత్యనారాయణకు గాయాలయ్యాయి. ఈయనకు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్‌ఐ కె.ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం ఆర్‌కె బట్టివలస గ్రామ శివార్లలో సారా రవాణా చేస్తున్న బంగారి వెంకటరమణిని మంగళవారం అదుపులోకి తీసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.సింహాద్రి తెలిపారు. అతడి నుంచి 220 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఇదే కేసులో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా చీడివలస గ్రామానికి చెందిన రత్నాల రమేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెచ్‌సీ రాంబాబు, ఈసీలు జనార్దనరావు, మనోజ్ పాల్గొన్నారని తెలిపారు.

అసభ్యకర పోస్టుపై కేసు

గజపతినగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలపై ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టు పెట్టిన అకౌంట్‌పై గజపతినగరం పట్టణానికి చెందిన కలిశెట్టి భానుప్రకాశ్ మంగళవారం గజపతినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్‌ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ నాయకులపై వైసీపీ ఆంధ్రా 151 అకౌంట్‌లో అసభ్యకర పోస్టులు ట్రోల్ చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. దీనిపై సీఐ ఎ.జి.వి.రమణ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రేగిడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడమెట్ట సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉంగరాడకు చెందిన పల్లె నారాయణరావు, పల్లె అప్పలనాయుడులకు తీవ్రగాయాలయ్యాయి. ఉంగరాడ నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై పల్లె నారాయణరావు, పల్లె అప్పలనాయుడు ఉంగరాడమెట్ట సెంటర్‌కు వస్తుండగా దారిలో సడన్ బ్రేక్ వేయటంతో బైక్ జారి పడింది. దాంతో ఇద్దరికి తల, శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. రేగిడి 108 సిబ్బంది ఈశ్వరరావు, నారాయణరావు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స నిర్వహించి, రాజాం ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విజయనగరం క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో అగ్నిప్రమాదాల నివారణ అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

●గజపతినగరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ ఉద్యోగులు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్ర అధికారి ప్రసాదరాజు మాట్లాడుతూ బస్సులు, రైళ్లలో పేలుడు పదార్థాలు, గ్యాస్, పెట్రోల్ తరలించకూడదన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే తక్షణమే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేయాలన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

●కొత్తవలస: అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా సోమవారం కొత్తవలస అగ్నిమాపక కేంద్రం, కంటకాపల్లికి చెందిన శారడా కర్మాగారానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో కొత్తవలస-విజయనగరం రోడ్డులోని పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తవలస అగ్నిమాపక కేంద్ర అధికారి వై.అశోక్‌కుమార్, సిబ్బంది, శారడా కర్మాగారానికి చెందిన సేఫ్టీ హెడ్ పద్మాకర్, ఫైర్ ఆఫీసర్ రాజశేఖర్, ఎల్ఎఫ్ కనకారావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆటో బోల్తా: వ్యక్తి మృతి

వేపాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లంకి సమీపంలో సోమవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాల మేరకు.. బల్లంకి గ్రామానికి చెందిన కొంతమందితో మారడబూడి రమణ అదే గ్రామానికి చెందిన కొత్తల శ్రీను ఆటోలో పూసపాటిరేగ మండలంలోని గోవిందపురంలో గల తన బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో బల్లంకికి సమీపంలోని గుమ్మడి బంద వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దాంతో ఆటోలోని రమణ రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలయ్యాయి. వల్లంపూడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా ముగించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శృంగవరపుకోటలోని ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. రమణ భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీ కొనడంతో మహిళ..

లక్కవరపుకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొన్న ఘటనలో మండలంలోని రంగారాయపురానికి చెందిన పిల్లా వరలక్ష్మి (45) మృతి చెందినట్టు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వరలక్ష్మి తన కుమారుడు మురళీతో కలిసి విశాఖలో పండగకు సోమవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. కొంతదూరం వారు వెళ్లిన తర్వాత రాత్రిపూట అంతదూరం ఎందుకని తిరిగి వచ్చేయమని కుటుంబ పెద్దలు చెప్పడంతో స్వగ్రామానికి తిరిగి ప్రయాణమయ్యారు. గ్రామంలో మలుపు తిరుగుతుండగా అదే మార్గాన మరో బైక్ ఢీ వేగంగా వచ్చి దీన్ని ఢీకొంది. దాంతో వరలక్ష్మికి బలమైన గాయాలయ్యాయి. ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె అర్ధరాత్రి మృతి చెందిందన్నారు. మురళీ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

ఎచ్చెర్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాలెం ఫ్లై ఓవర్ కింద జరిగిన ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లాలోని రేగిడి ఆమదాలవలస మండలంలో గల లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగడ చినలచ్చయ్య (74) సోమవారం లావేరు మండలంలోని బుడుమూరు సంతకు వచ్చాడు. తన పనులను ముగించుకుని రాత్రి వేరే చోట ఉన్నాడు. మంగళవారం తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో చిలకపాలెం ఫ్లైఓవర్ కింద నిల్చొని ఉన్న లచ్చయ్యను సర్వీసు రోడ్డులో వస్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడటంతో ఆయన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. లచ్చయ్యకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

రామభద్రపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 13న జనసేన నాయకుడు మహంతి ధనంజయ్‌పై దాడి ఘటనలో వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రామభద్రాపురంలో సుమారు 20 సెంట్ల భూవివాదంపై హైకోర్టులో స్టే ఆర్డర్ ఉండగా అదే స్థలంలో అక్కునాయుడు ఇటీవల పండ్ల దుకాణం పెటుకోవడానికి సిమెంట్ స్తంభాలు వేశాడు. దీంతో జనసేన నాయకుడు ధనంజయ్.. తహసీల్దార్, స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ధనంజయ్‌ను చంపాలన్న ఉద్దేశంతో అక్కునాయుడు ప్రణాళిక రచించాడు. ధనంజయ్ ఇంటికి వస్తాడని ఆటోలో కాపుకాసి కొబ్బరి బొండాల కత్తితో తల, వీపు, చేతిపై గాయపరిచాడు. విషయం గమనించిన స్థానికులు గాయపడిన వ్యక్తిని బొబ్బిలి ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి విజయనగరం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ధనంజయ్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. దీంతో అక్కునాయుడును మంగళవారం అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు, ఏఎస్‌ఐలు రమణ, అప్పారావు, కానిస్టేబుళ్లు నాగార్జున, రవికుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు..

విజయనగరం క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీ బస్టాండ్ సమీపంలోని గాయత్రి మెటల్ షాపులో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మార్చి 30న రాత్రి షాపులో 240 కిలోల రాగి, 120 కిలోల ఇత్తడి, 3 ఇన్వెర్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయని షాపు యజమాని పత్తిగిల్లి దిలీప్‌కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. దాంతో పెందుర్తి మండలం చినముసిరివాడ అంబేడ్కర్ కాలనీకి చెందిన పెంద్ర నాయుడు అలియాస్ పోతురాజు, పెంద్ర దర్శన్‌బాబులను మంగళవారం అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 120 కిలోల రాగి, 80 కిలోల ఇత్తడిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రికవరీ చేసిన ఎస్‌ఐ సురేంద్రనాయుడు, హెచ్‌సీ రమణారావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, గౌరీశంకర్‌లను అభినందించినట్టు సీఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం

● మూడు ద్విచక్రవాహనాలు, విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


బైక్‌లు, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం ఓ కారు వెనుక నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం వండానపేటకు చెందిన కొమ్మోజు గణపతిరావు తన ద్విచక్ర వాహనంపై వీరఘట్టం వైపు వెళ్తున్నాడు. అదే మండలం చిన్నయ్యపేటకు చెందిన సవరిగాన సింహాచలం తన కారుపై వీరఘట్టం వైపుగా వెళ్తున్నాడు. ఈ సమయంలో వర్షం కురవడంతో పాటు ద్విచక్ర వాహనదారుడు ఉన్నట్టుండి తన వాహనాన్ని కుడివైపునకు మళ్లించే యత్నం చేశాడు. దీంతో సింహాచలం దానిని తప్పించబోయిన కారును పూర్తిగా కుడివైపునకు మళ్లించాడు. దీంతో కారు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బలంగా తాకింది. అలాగే అక్కడ నిలిపి ఉన్న రెండు ద్విచ్రక వాహనాలు, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు గణపతిరావు గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్‌ఐ ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మక్కువ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ స్కూల్‌లో విద్యార్థులను కొట్టిన వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పాఠశాలలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్త దుస్తులు పోవడంతో విద్యార్థులను బాధ్యులను చేస్తూ వార్డెన్ వారిని తీవ్రంగా కొట్టినట్టు వారి తల్లిదండ్రులకు విషయం తెలిసింది. దీంతో తల్లిదండ్రులు మంగళవారం ఆ పాఠశాలకు వెళ్లి, ప్రిన్సిపాల్ ఎర్రినాయుడును నిలదీశారు. వారి వెంట ఏఐఎస్ఎఫ్ నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు ఉన్నారు. దీంతో ప్రిన్సిపాల్ సంబంధిత వార్డెన్‌ను ప్రశ్నించగా విద్యార్థులను కొట్టలేదని, క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కొంతసేపు నిలబెట్టానని తెలిపారు. అయితే విద్యార్థులందరూ ముందుకు వచ్చి వార్డెన్ కొట్టారని తెలిపారు. వార్డెన్ పై చర్యలు తీసుకోకపోతే ఐటీడీఏ పీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రవి కుమార్ హెచ్చరించారు.

యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం

పార్వతీపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఐటీసీ, ప్రథమ్ సంయుక్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నాయని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రథమ్ సంస్థ ద్వారా వెనుకబడిన, అర్ధాంతరంగా స్కూల్ మానేసిన 18 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయస్సు ఉన్న యువతీ యువకులకు ఒకేషనల్ స్కిల్స్ కోర్సుల్లో (ఫుడ్ అండ్ బేవరేజీ సర్వీస్, హౌస్ కీపింగ్ సర్వీస్, ఫుడ్ ప్రొడెక్షన్ కోర్సు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎలక్ట్రీషిన్, వెల్డింగ్) 45 రోజులు శిక్షణ ఇస్తుందని తెలిపారు. కనీస విద్యార్హత 8వ తరగతి పాసై ఉండాలని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తారని చెప్పారు. శిక్షణా కాలంలో భోజన వసతి, యూనిఫారం, షూస్ శిక్షణకు ఉపయోగించే స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తారని కలెక్టర్ తెలిపారు. వివరాలకు 9676965949కు సంప్రదించాలని ఆయన సూచించారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ మంత్రి పుష్పశ్రీవాణి తప్పుడు ఆరోపణలకు సిద్ధమవుతున్నారని టీడీపీ అరకు పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన చికలాంలో మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో కురుపాం నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11 నెలల సమయంలోనే పూర్తిస్థాయిలో రహదారులతో పాటు పలు అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సొంత వారికే ప్రయోజనం కల్పించిన ఘనత పుష్పశ్రీవాణికే దక్కిందన్నారు. ఆయన తోపాటు మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ ఉన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా అంబటి

గరుగుబిల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా అంబటి రామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్టకు చెందిన రామకృష్ణ టీడీపీలో క్రియాశీల కంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సేవలందించారు. ఈసందర్భంగా రామకృష్ణను సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటతినాయుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావులు అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని అన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బెలగాం/ పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యో తి): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన చర్యలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని పార్వతీపురం అగ్నిమాపక అధికారి జి.ప్రభాకర్ రావు అన్నారు. జాతీయ అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అగ్ని ప్రమాదాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం దుర్గ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పులిపుట్టి భారతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులతో స్కౌట్స్ గైడ్స్ నిర్వహించారు. ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా అగ్ని ప్రమాద వారోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలకొండ అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో ఈనెల 17న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ జయరాం తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకాధికారి చిన్నబాబు హాజరవుతారని చెప్పారు. ప్రజలు ఈ గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



నూకాలమ్మ దేవత ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

పాచిపెంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట గ్రామదేవత నూకాలమ్మ తల్లి పెద్ద పండుగను పురస్కరించుకుని ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 12, 13, 14 తేదీలలో పెద్ద పండగను నిర్వహించనున్నారు. ఈసందర్భంగా డప్పు వాయిద్యాల మధ్య భక్తులు సందడితో ఘటాలను ఊరేగించారు.

అక్కడ వృథా.. ఇక్కడ వ్యథ

● గొల్లవీధిలో కుళాయిలకు కానరాని ట్యాప్‌లు

● తాగునీటికి ఇబ్బంది పడుతున్న రెల్లివీధి వాసులు



ట్యాప్ అమర్చకపోవడంతో వృథాగా పోతున్న నీరు



తాగునీటి కోసం కొళాయి వద్ద వేచి ఉన్న మహిళలు

వీరఘట్టం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని గొల్లవీధిలో కుళాయిలకు ట్యాప్‌లు అమర్చకపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. ఈ కారణంగా రెల్లి వీధివాసులకు సరిగ్గా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని, దీంతో ప్రతిరోజూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని కుళాయిలకు ట్యాప్‌లు అమర్చి తాగునీరు వృథా కాకుండా చూడాలని రెల్లివీధి వాసులు కోరుతున్నారు.

● ఈ విషయమై పంచాయతీ ఈవో బి.కోటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. గొల్లవీధిలో పరిశీలించి కుళాయిలకు ట్యాప్‌లు అర్చుతామని, రెల్లివీధి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెచ్చులూడుతున్న రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం/కురుపాం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): అంటిజోల-మనిగ గ్రామాల మధ్య రూ.1.57కోట్ల అంచనాలతో వేస్తున్న 2.3 కిలోమీటర్ల రోడ్డు ప్రారంభానికి ముందే పెచ్చులూడిపోతున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'ప్రారంభానికి ముందే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు స్పందించారు. మంగళవారం పెచ్చులూడిపోతున్న ప్రాంతాల్లో కొత్తగా తారు రోడ్డు వేయించి రోలర్‌తో రోలింగ్ చేయించారు. కొలతల ప్రకారం రోడ్డు వేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఆ శాఖ ఏఈఈ నాగేశ్వరరావు పనులను పర్యవేక్షించారు.

న్యాయాధికారిని కలిసిన ఎస్పీ



న్యాయాధికారి చక్రవర్తికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా న్యాయాధికారిగా పని చేసి ఇటీవల గుంటూరు జిల్లాకు బదిలీ అయిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ న్యాయాధికారి బి.కళ్యాణ చక్రవర్తిని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి మర్యాదపూరక్వంగా మంగళవారం కలిశారు. ఈసందర్భంగా జ్ఞాపికను అందజేశారు. పోలీస్ శాఖతో సమన్వయంగా పనిచేస్తూ మంచి సహకారం అందించారని ఎస్పీ కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ సూచించారు. మంగళవారం నాగూరులో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పంచాయతీ రాజ్ చట్ట నిబంధనల మేరకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించి అభివృద్ధి పథకాలను అందించాలన్నారు. ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో మూడు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల పరిశీలన

సీతానగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి రాజేశ్వరి, ఎంపీడీవో త్రివిక్రమరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం కాశీపేట గ్రామంలో గృహ నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. పనులు జరిపిన వారికి బిల్లులు అందుతాయన్నారు. అలాగే ఎస్సీ, బీసీ వారికి రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్న, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



పాఠశాల ప్రహరీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): పెదగొత్తిలి పంచాయతీ పరిధిలోని కోలిసగూడ, ఆరికకురిడి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల ప్రహరీలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే దిశలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, టీడీపీ మండల కన్వీనరు కలిశెట్టి కొండయ్య, పార్టీ అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనులు చేస్తారా?



సమావేశంలో ప్రశ్నిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

కొమరాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో నుంచి కార్యాలయ సిబ్బంది వరకు ప్రతి పనికీ డబ్బులు ఇస్తే తప్ప పనులు జరగడం లేదని కుమ్మరిగుంట సర్పంచ్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై జరుగుతున్న చర్చలో లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. మొదటి విడత జరిగిన జగనన్న భూరీసర్వేలో అనేక తప్పులు చోటు చేసుకున్నాయని, వాటిని సరిదిద్దడానికి వీఆర్వో వద్దకు వెళ్తే ముడుపులు చెల్లిస్తే గానీ పనులు జరిగే పరిస్థితి లేదని అన్నారు. దీనిపై సమావేశంలో ఉన్న డీటీ స్పందిస్తూ దీనిపై విచారణ చేసి చర్యలు చేపడతామన్నా రు. ఉపాధి హామీ సిబ్బంది సర్పంచ్‌లకు సరైన గౌరవం ఇవ్వడం లేదని గంగరేగివలస సర్పంచ్ కోడి తిరుపతి రావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు సర్పంచ్‌గా తనకు తెలియజేయడం లేదన్నారు. దీనిపై ఏపీవో బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి సమాచారం అందేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై ఎంపీపీ అధ్యక్షతన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లిఖార్జునరావు, జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మితో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమ్మె ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.సంజీవి, సహ కార్యదర్శి పడాల వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్ అవుతున్న కార్మికులకు రూ.75వేలు బెనిఫిట్ ఇస్తామని, పిల్లలకు ఉద్యోగం ఇస్తామన్న హామీలు ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. హామీలు అమలు చేయకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు పడాల వేణు, విమల, శ్రీదేవి, రఘు, సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కురుపాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, కార్యవర్గ సభ్యుడు జి.సూరయ్య, ఎం.సింగన్న, గిరిజనులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు వేతనం పెంచండి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి

బెలగాం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలకు వేతనాలు పెంచాలని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షురాలు గౌరీ అధ్యక్షతన ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 20 ఏళ్లు అయిందని, పనికి తగిన పారితోషకం అందడం లేదని, ఆశాలకు, సీహెచ్‌డబ్ల్యూలకు కనీస వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, యూనిఫాంలు ఇవ్వాలని, క్యాజువల్, మెడికల్ సెలువులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు శివాని, సీఐటీయూ నాయకులు డి.రమణారావు, వై.మన్మథరావు, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సాగుభూమిని అప్పగించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు మన్మథరావు

బెలగాం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన దళిత రైతుల భూములను అధికారులు తిరిగి వారికి అప్పగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జేసీ శోభికకు వారు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు మాట్లాడారు. లివిరి గ్రామానికి చెందిన దళితులకు ప్రభుత్వం 30 ఎకరాల డీపట్టా భూమిని సాగు చేసుకునేందుకు మంజూరు చేసిందన్నారు. అయితే ఈ భూమిని అనకాపల్లికి చెందిన ఒక వ్యక్తి దౌర్జన్యంగా కబ్జా చేసి, తన స్వాధీనంలో ఉందని దళితులను బెదిరించాడని మన్మథరావు ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు భామిని తహసీల్దార్‌కు విన్నవించినా స్పందించలేదని తెలిపారు. దళితులకు జరిగిన అన్యాయాన్ని రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూ ఆక్రమణ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని దళితుల భూములు వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆర్వీఎస్ కుమార్, గుజ్జి జనార్ధన్, ఈవీ నాయుడు, అప్పలనాయుడు, శంకరరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మన ఊరు - మన ఇళ్లు కార్యక్ర మంలో భాగంగా మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ స్కీంలో మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. వెంటనే జియోట్యాకింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సచివాలయంలో ఉన్న ఇంజనీరింగ్ కార్యదర్శులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ మాధవరావు, సచివాలయ ఇంజనీరింగ్ అడ్మిన్లు ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఎస్‌డీసీ బదిలీ

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ)గా పనిచేస్తున్న వెంకటరమణకు బదిలీ అయ్యింది. గృహ నిర్మాణ శాఖ జనరల్ మేనేజర్‌గా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ఆయన స్థానంలో ఎవరిని నియమించేది ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది.

కబడ్డీ క్రీడకు ప్రాధాన్యం ఇవ్వాలి

పాలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విజయవాడలో రాష్ట్ర క్రీడాభివృద్ధి చైర్మన్ రవి నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర క్రీడకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని కోరారు. దీనిపై రవినాయుడు స్పందించి ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తానని హామీఇచ్చారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వీరఘట్టం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం పాలకొండ ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ రౌతు భారతి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 55 మంది స్త్రీలకు తనిఖీలు చేసి మందులు అందించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచనలు చేశారు. అనంతరం గురజాడ విద్యా సంస్థల అధినేత జీవీ స్వామినాయుడు గర్భిణులకు డ్రైఫ్రూట్స్, నువ్వు ఉండలను పంపిణీ చేశారు. వైద్యుడు ప్రదీప్‌కుమార్, సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

కురుపాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కురుపాం పోలీసులు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో కురుపాం బస్టాండ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనాలు ఎదురెదురుగా వచ్చేటప్పుడు ఎలా నిబంధనలు పాటించాలి అనే దానిపై ఆయన విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిఉండాలన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

సీతానగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెదభోగిలి పంచాయతీ పరిధిలోని కోరాడ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రామచంద్రరావు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మస్తర్లు, పనులను పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. చెరువును లోతుగా తవ్వాలని సూచించారు. ఆయనతో పాటు ఫీల్డ్‌అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.